

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 173 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు శనివారం, అక్టోబరు 24, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram

మీ సైనికుల మృతదేహాలకు మేమే..

అంత్యక్రియలు చేశాం..!!

ఐరాసలో పాక్‌కు భారత్ చురకలు

జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయం..దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు లేదు

కశ్మీర్‌పై పెట్టే శ్రద్ధ.. తన ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనార్టీలపై పెట్టాలి



అంతర్జాతీయ వేదిక మీద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాదికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది.

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సీఎం రేవంత్

2 కీలక ఆదేశాలు

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలి

- 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం
- మహారాష్ట్రలో ముంపు ప్రభావం, నీటి లభ్యతపై నివేదికలు సిద్ధం చేయాలి
- డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు కేటాయించాలి
- అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలి
- శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదులకు అదనంగా 0.6 టీఎంసీల నీరు తరలించేలా ఏర్పాట్లు
- పాలమూరు ప్రాజెక్టు నీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి
- పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర వ్యవస్థల పనులు వెంటనే చేపట్టాలి

బంగాళాఖాతంలో

అల్పపీడనం..!!


ఏపీకి వర్ష సూచన

- శనివారం నాటికి అదే ప్రాంతంలో వాయుగుండంగా మారనుంది
- ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడినుంది
- ఈ నెల 26న బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం
- అల్పపీడనం ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం
- ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

అమరావతి: తూర్పు మధ్య- ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. శనివారం నాటికి అదే ప్రాంతంలో వాయుగుండంగా రూపాంతరం చెందనుంది. ఆదివారం తీవ్ర



వాయుగుండంగా బలపడి.. ఈ నెల 26 ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉంది. తుపాను ఆ తర్వాత రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని కోరింది.



యువశక్తితో బలమైన... భారత్..!!

చిన్మయ సమ్మేళనంలో మోదీ ప్రసంగం

- యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే బలమైన భారత్‌ను నిర్మించవచ్చు
- 'చిన్మయ అమృత మహోత్సవ గ్లోబల్ సమ్మేళన్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- అక్టోబర్ 25 వరకు చిన్మయ మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల ముగింపు కార్యక్రమం
- తన విధానాలన్నింటిలోనూ యువతే కేంద్ర బిందువుగా నిలుస్తోంది
- చిన్మయ మిషన్ కేవలం ఒక సాధారణ సంస్థ కాదు..ఒక సనాతన ఆధ్యాత్మిక తత్వానికి రూపం
- తన నాగరికతా మూలాల నుంచే భారతదేశం గుర్తింపు పొందుతోంది
- మన దేశమే మన స్మృతికి జన్మస్థానమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం

యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే బలమైన భారత్‌ను నిర్మించవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో 'చిన్మయ అమృత మహోత్సవ గ్లోబల్ సమ్మేళన్'ను ప్రధాని మోదీ ప్రారంభించారు. చిన్మయ మిషన్ 75 ఏళ్ల ఉత్సవాల ముగింపు కార్యక్రమం నేటి నుంచి అక్టోబర్ 25 వరకు జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన మోదీ... 1993లో ఆధ్యాత్మిక గురువు స్వామి చిన్మయానందతో జరిగిన తన చివరి సమావేశాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ భేటీలో దేశాభివృద్ధిలో యువత పాత్ర, యువశక్తిని పెంపొందించడంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు మోదీ వెల్లడించారు. స్వామిజీతో సమావేశం జరిగిన కొన్నేళ్లకే ప్రజలు తనకు గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారని, అప్పటి నుంచి తన విధానాలన్నింటిలోనూ యువతే కేంద్ర బిందువుగా నిలుస్తోందని మోదీ పేర్కొన్నారు. అలాగే, చికాగోలో జరిగిన 'పార్లమెంట్ ఆఫ్ ది వరల్డ్ రిలీజియన్స్' శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలంటూ తాను చేసిన ఆహ్వానాన్ని స్వామి చిన్మయానంద అప్పట్లో అంగీకరించిన విషయాన్ని ప్రధాని గుర్తు చేసుకున్నారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సాధారణ సంస్థ కాదని, ఒక సనాతన ఆధ్యాత్మిక తత్వానికి రూపమని మోదీ అభివర్ణించారు. తన నాగరికతా మూలాల నుంచే భారతదేశం గుర్తింపు పొందుతోందని, మన దేశమే మన స్మృతికి జన్మస్థానమని మోదీ స్పష్టం చేశారు. చిన్మయ అమృత మహోత్సవ వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 300 రోజుల్లో 40,000 కిలోమీటర్లు ప్రయాణించి, లక్షలాది మందిని కలుసుకున్న యువతీయువకుల బృందాన్ని ప్రధాని ప్రశంసించారు. వేదాంత, భగవద్గీత జ్ఞానాన్ని అందరికీ అందించే లక్ష్యంతో 1951లో స్వామి చిన్మయానంద ఈ మిషన్‌ను ప్రారంభించారు.

తెలంగాణ పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు...

తీసుకొచ్చాం..!!

దక్షిణాది రాష్ట్రాల పరస్పర సహకారంతో నేరాలను పూర్తిగా అరికట్టవచ్చు

దక్షిణాది రాష్ట్రాల పోలీస్ ప్రాంతీయ సమన్వయ సమావేశం జరిగింది

తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ డీజీపీలు హాజరు

- "సమాజానికి భద్రత, రక్షణ పునాదులు లాంటివి...
- సమర్థ, నిష్పక్షపాత పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటారు
- హైదరాబాద్‌ను నాలుగు కమిషనరేట్లుగా విభజించి సేవలందిస్తున్నాం
- నార్కోటిక్స్, సైబర్ నేరాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టాం...
- మన సైబర్ సైక్యూరిటీ బ్యూరో, ఈగల్ ఫోర్స్‌కు కేంద్ర అవార్డులు వచ్చాయి
- పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్ తీసుకొచ్చాం
- పోలీసు శాఖపై పెట్టే ఖర్చును పౌరుల భద్రతకు పెట్టుబడిగా భావిస్తున్నాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ గ్రేహౌండ్స్‌కు మంచి పేరుంది: డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల పరస్పర సహకారంతో నేరాలను పూర్తిగా అరికట్టవచ్చని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల పోలీస్ ప్రాంతీయ సమన్వయ సమావేశం జరిగింది. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ డీజీపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "సమాజానికి భద్రత, రక్షణ పునాదులు లాంటివి. సమర్థ, నిష్పక్షపాత పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటారు. తెలంగాణ పోలీస్ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. హైదరాబాద్‌ను నాలుగు

..2లో..

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు..

అధికారులకు ఎస్ఈసీ

కీలక ఆదేశాలు..!!

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ అనిల్



చంద్ర పునేఠా మరో కీలక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల గడువు ఈ రోజు సాయంత్రం 5 గంటలతో ముగియనుందని తెలిపింది. కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు తమను నామినేషన్లు దాఖలు చేయకుండా ఎవరైన అడ్డుకున్నారా అనే ఫిర్యాదులను వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ఈ ఫిర్యాదుల విషయంలో అధికారులు వెంటనే ఫిర్యాదుదారులను ఫోన్‌లో సంప్రదించి సాయంత్రం 5 గంటల్లోపు వారితో నామినేషన్ దాఖలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ విధానానికి అనుగుణంగా సమర్పించిన నామినేషన్లను స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించాలని అన్నారు. నామినేషన్ల కేంద్రానికి వెళ్లేందుకు అవసరమైన ప్రాంతాల్లో అభ్యర్థులకు వ్యక్తిగత భద్రత కల్పించాలని ఆదేశించారు. నామినేషన్లు వేసేందుకు అవసరమైన ప్రశాంత వాతావరణం కూడా కల్పించాలని ఆదేశించారు.



చంద్రబాబుతో మరోసారి పవన్ భేటీ..

సీట్ల సర్దుబాటుపై చర్చ..!!

- కూటమి సీట్ల సర్దుబాటుపై సుమారు అరగంట పాటు ఇరువురు చర్చలు
- తెదేపా, జనసేన, భాజపాలోని ఆశావహులు నామినేషన్లు దాఖలు
- ఆయా చోట్ల ఏకాభిప్రాయం సాధించే అంశంపై చంద్రబాబు, పవన్ చర్చలు

అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. పలుచోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సీఎం నివాసానికి పవన్ చేరుకుని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేషన్ల గడువు నేటితో ముగుస్తున్న నేపథ్యంలో కూటమి సీట్ల సర్దుబాటుపై సుమారు అరగంట పాటు వీరిద్దరూ చర్చించారు. తెదేపా, జనసేన, భాజపాలోని ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో ఆయా చోట్ల ఏకాభిప్రాయం సాధించే అంశంపై చంద్రబాబు, పవన్ చర్చించారు. గురువారం కూడా సీఎంతో పవన్ సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించిన విషయం తెలిసిందే.

తెలంగాణ పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం

(మొదటిపేజీ తరువాయి)

కమిషనరేట్లుగా విభజించి అత్యుత్తమ సేవలందిస్తున్నాం. నార్కోటిక్స్, సైబర్ నేరాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టాం. మన సైబర్ సైక్యూరిటీ బ్యూరో, ఈగల్ ఫోర్స్‌కు కేంద్ర అవార్డులు వచ్చాయి. ఆహార కల్తీ నివారణకు టీజీ సేఫ్, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు హైడ్రా ఏర్పాటు చేశాం. పోలీస్ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్ తీసుకొచ్చాం. పోలీసు శాఖపై పెట్టే ఖర్చును పౌరుల భద్రతకు పెట్టుబడిగా భావిస్తున్నాం"అని సీఎం అన్నారు.

తెలంగాణ గ్రేహౌండ్స్‌కు మంచి పేరుంది: డీజీపీ సీవీ ఆనంద్

మావోయిస్టులను ఎదుర్కొనేందుకు 1980ల్లో గ్రేహౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. " మన గ్రేహౌండ్స్ విభాగానికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. గతంలో హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయి. తీవ్రవాద కార్యకలాపాలు అరికట్టేందుకు ఆక్టోపస్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. డ్రగ్స్ ముఠాలను పట్టుకునేందుకు అనేక ఆపరేషన్లు చేశాం. డ్రగ్స్ కట్టడికి చేసిన కృషికి కేంద్ర హోంశాఖ అవార్డు ఇచ్చింది. సైబర్ నేరాల కట్టడికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. దీనికి కూడా కేంద్రం అవార్డు ఇచ్చింది. ఇటీవల జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ మారింది. 824 మంది నక్సల్స్ లొంగిపోయారు.. 302 ఆయుధాలు అప్పగించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా ప్రకృతి విపత్తుల్లో సమర్థంగా సేవలందించాం. పోలీసులు వాడే యాప్‌లను టీస్పార్క్ పేరుతో అప్‌డేట్ చేశాం. మహిళల భద్రతకు ప్రత్యేక విభాగం పని చేస్తోంది. దీని కోసం టీసేఫ్ యాప్ రూపొందించాం" అని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు.

మీ సైనికుల మృతదేహాలకు మేమే...
అంత్యక్రియలు చేశాం..!!

(మొదటిపేజీ తరువాయి) ఐరాస సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా మంగళానందన్ ఖండించారు. జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయమని.. దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్‌పై పెట్టే శ్రద్ధ.. తన ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనార్టీలపై పెట్టాలని సూచించారు. అనేకమంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని.. నిరంతరం వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. 'అసాధారణ పరిస్థితులలో అంత్యక్రియల హక్కులు.. మత విశ్వాసాలు' అనే అంశంపై చర్చలో మంగళానందన్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. '1999లో కార్గిల్‌లో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని ఒక దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం విడ్డూరం. నేను వారికి ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను. వారు తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో వదిలేసిన సమయంలో.. వాటికి భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించింది. ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను చంపడమే కాకుండా.. ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడు. అలాంటి ఉగ్రవాదుల హక్కుల కోసం ఇంత తీవ్రంగా వాదిస్తున్న పాకిస్థాన్.. ఉగ్రవాద బాధితుల హక్కుల గురించి ఆలోచించకపోవడం ఆశ్చర్యకరం' అని మంగళానందన్ పేర్కొన్నారు.

కుప్పంలో 'దృశ్యం' తరహా
హత్య కలకలం..

భర్తను చంపి అడవిలో పాతిపెట్టిన భార్య!

చిత్తూరు జిల్లా కుప్పంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను భార్య తన ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని అడవిలో పాతిపెట్టినట్లు తెలిపారు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని కేసు ఛేదించినట్లు పోలీసులు పేర్కొన్నారు.



చిత్తూరు జిల్లా కుప్పంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను భార్య తన ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని అడవిలో పాతిపెట్టినట్లు తెలిపారు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని కేసు ఛేదించినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని తిరుపత్తూర్‌కు చెందిన శశికుమార్‌ను ఆయన భార్య లక్ష్మి, ఆమె ప్రియుడు ప్రభు కలిసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన మృతదేహాన్ని అడవిలో పాతిపెట్టినట్లు ప్రాథమిక నిర్ధారణ అయ్యింది. ఈ ఘటనకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని అడవిలో పాతిపెట్టిన తీరు, నేరాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించినట్లు వెలుగులోకి వచ్చిన అంశాలు ఈ ఘటనను 'దృశ్యం' సినిమా కథను తలపించేలా చేశాయి. అయితే, ఈ కేసులో పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయ్యాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన కుప్పం అర్బన్ పోలీసులు లక్ష్మి, ప్రభులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ హత్య కేసు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నేరానికి సంబంధించిన పూర్తి వివరాలు, హత్యకు దారితీసిన పరిస్థితులు, మృతదేహాన్ని గుర్తించిన తీరుపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

తాళం వేసి ఉన్న ఇంటి నుంచి ఒక్కటే దుర్వాసన..

తెరిచి చూస్తే మైండ్‌బ్లాక్..!

విశాఖపట్నంలో దారుణం. తాళం వేసిన ఇంట్లో దుర్వాసన రావడంతో పోలీసులు తలుపులు తెరిచి చూడగా, లాలం శ్రీదేవి అనే వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతిచెంది ఉంది. పోస్ట్‌మార్టం నివేదికలో హత్యగా తేలింది. బంగారం కోసమే పక్కింటి ఫల్గుణరావే ఆమెను ఊపిరి ఆడకుండా చేసి చంపినట్లు పోలీసులు వెల్లడించారు. ఒంటరిగా ఉన్న మహిళలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



ఇంటికి తాళం వేసి ఉంది.. అదే ఇంటి నుంచి దుర్వాసన వస్తుంది..! పోలీసులకు సమాచారం ఇస్తే.. ఇంట్లో ఓ డెడ్ బాడీ.. వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంది. మరి.. ఇంట్లో వృద్ధురాలు ఉంటే బయట నుంచి తాళాలు ఎవరు వేశారు..? కూపీ లాగితే.. పోలీసులకు క్లూ దొరికింది. పక్కింటి వాడే ఆమె ప్రాణం తీసేశాడు. ఆ హత్యకు కారణం ఏంటి..? పోలీసులు కేసు ఎలా ఛేదించారు..?

విశాఖ కంచరపాలెం పట్టాభిరెడ్డి గార్డెన్స్ ప్రాంతం. పోలీసులకు అక్టోబర్ 17వ తేదీన ఓ ఫోన్ కాల్. ఓ ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లు అనుమానాస్పదంగా ఉందంటూ ఆ కాల్ సారాంశం. రంగంలోకి దిగిన పోలీసులు.. తలుపులు తీశారు. లోపలికి వెళ్లి చూస్తే.. లాలం శ్రీదేవి అనే వృద్ధురాలు అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయి ఉంది. కానీ బయట నుంచి ఇంటికి తాళం వేసి ఉంది. మృతదేహం వద్ద పెనుగులాట జరిగిన ఆధారాలు పోలీసులకు కనిపించాయి. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం కు తరలించారు.

పోలీసుల ఆ.. అనుమానమే నిజమైంది..!... లాలం శ్రీదేవిని అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఒంటరిగా మహిళ ఉంటున్నట్లు తెలుసుకున్న వాళ్లే.. పరిచయస్తులే ఈ పని చేసి ఉంటారని అనుమానించారు. మెడలో బంగారం గొలుసు మాయమైనట్లు గుర్తించారు. ఇంతలో పోస్టుమార్టం నివేదిక వచ్చింది. అందులో ఆ వృద్ధురాలిని ఊపిరి ఆడకుండా చేసి ప్రాణాలు తీసినట్లు గుర్తించారు పోలీసులు. అప్పటికే సేకరించిన ఆధారాలతో.. పోలీసులు నిందితుడిని కన్ఫర్మ్ చేసుకున్నారు.

పక్కింటి వాడే ఆ పని చేశాడు..!... నిందితుడు ఫల్గుణరావు.. శ్రీదేవి నివాసముంటున్న ప్రాంతంలోనే ఉంటాడు. పక్కింట్లోనే నివాసం ఉంటున్నాడు. శ్రీదేవి పిల్లలు.. ఒకరు విదేశాల్లో.. మరొకడు హైదరాబాదులో ఉంటున్నారు. రెండు నెలల క్రితమే పట్టాభిరెడ్డి గార్డెన్స్ ప్రాంతంలోకి ఆ వృద్ధురాలు అద్దెకు దిగింది. ఆమెకు పక్కింట్లోనే ఉంటున్నాడు ఫల్గుణరావు. ఒంటరిగా ఉంటున్న విషయాన్ని గుర్తించిన వాడికి.. దుర్బుద్ధి పుట్టింది. తనకున్న ఆర్థిక సమస్యలు ఎలా తీర్చాలి అన్న దానిపై ప్లాన్ చేసుకున్నాడు. వృద్ధురాల నుంచి టార్గెట్ చేశాడని క్రైమ్ ఏడీసీపీ రమ్య అన్నారు.

అలా ప్లాన్ చేసి.. వాటర్ బాటిల్ తో.. ఫల్గుణరావు ఫ్యామిలీ ఊరెళ్ళింది. దీంతో ఇదే అదనుగా భావించాడు.. ఈనెల 14వ తేదీ రాత్రి 7 గంటలకు సమయంలో.. శ్రీదేవి ఇంటికి వెళ్ళాడు ఫల్గుణ రావు. కాళీ బాటిల్ తీసుకెళ్లి నీళ్లు కావాలని అడిగాడు. వీడి మాటలు వెనుక మర్మాన్ని గ్రహించలేని ఆ వృద్ధురాలు.. బాటిల్ తీసుకుని ఇంట్లోకి వెళ్లింది. ఆమె వెనకాలే లోపలికి చొరబడ్డాడు నిందితుడు. తిరిగి చూసేసరికి వెనుక నిలిచి ఉన్నాడు. అరిచేందుకు ప్రయత్నిస్తే వృద్ధురాలు నోరు నొక్కేశాడు. కిందకు తోసి.. ఊపిరి తీసేశాడు. ఆ తర్వాత ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్ ను లాక్కొని.. ఇంటి బయటకు వచ్చి తాళం వేసి పారిపోయాడని క్రైమ్ ఏడీసీపీ రమ్య వెల్లడించారు.

చైన్ అమ్మేసి.. ఏమీ ఎరగనట్టు నటించి.. తస్కరించిన ఆ చైన్‌ను ముత్తూట్ ఫైనాన్స్‌లో అమ్మకానికి పెట్టేశాడు. ఆ తర్వాత ఏమి ఎరగనట్టు మిన్నకుండిపోయాడు ఫల్గుణరావు. పోలీసులు రంగంలోకి దిగితే అసలు విషయం తెలిసింది. నిందితుడు పక్కింటివాడే అని తేలింది. పక్కా ఆధారాలతో ఫల్గుణ రావును అరెస్టు చేసిన పోలీసులు.. బంగారం అమ్మేసి, దగ్గర ఉంచుకున్న 21 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు అకౌంట్లోని 60వేలు నగదును ఫ్రీజ్ చేయించామని క్రైమ్ ఏడీసీపీ రమ్య తెలిపారు. ఫల్గుణరావుకు చెందన బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడు ఫల్గుణరావుని కటకటాల వెనక్కు నెట్టారు. వాటర్ కోసమని వచ్చి ఒంటరి మహిళను టార్గెట్ చేసి ఆమె ఊపిరి తీసిన కేసు లో పక్కింటి వాడే నిందితుడు కావడంతో ఇప్పుడు స్థానికులు హడలెత్తిపోతున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలి

152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి...ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

మహారాష్ట్రలో ముంపు ప్రభావం, నీటి లభ్యతపై నివేదికలు సిద్ధం చేయాలి...డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు కేటాయించాలి

అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలి...శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదులకు అదనంగా 0.6 టీఎంసీల నీరు తరలించేలా ఏర్పాట్లు

పాలమూరు ప్రాజెక్టు నీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి...పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర వ్యవస్థల పనులు వెంటనే చేపట్టాలి

హైదరాబాద్ : ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి, డిండి, అచ్చంపేట ప్రాజెక్టులపై చర్చించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావం,



నీటి లభ్యతపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు కేటాయించాలని, అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదులకు అదనంగా 0.6 టీఎంసీల నీరు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర వ్యవస్థల పనులు వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

సంపాదకీయం

హైదరాబాద్‌లో తాగునీటి ఆదాకు
మాస్టర్ ప్లాన్..!!

కోకాపేటలో గ్రీన్ వాటర్ స్టేషన్!

హైదరాబాద్‌లో తాగునీటి ఆదా కోసం జలమండలి వినూత్న ప్రణాళిక సిద్ధం చేసింది. నిర్మాణ పనులు, పరిశ్రమలు వంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని (గ్రీన్ వాటర్) వినియోగించనున్నారు. కోకాపేటలో ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇది తాగునీటి వినియోగాన్ని తగ్గించి, ప్రజల అవసరాలకు నీటి లభ్యతను పెంచుతుంది. నీటి వనరుల సంరక్షణకు ఈ చర్య కీలకం.

హైదరాబాద్ మహానగరంలో తాగునీటి వినియోగాన్ని తగ్గించి, అందుబాటులో ఉన్న జలవనరులను పొదుపుగా ఉపయోగించుకునేందుకు జలమండలి కొత్త ప్రణాళికను



సిద్ధం చేస్తోంది. నిర్మాణ పనులు, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు తాగునీటిని వినియోగించకుండా.. శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి ఉపయోగించేలా 'గ్రీన్ వాటర్' సరఫరా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఇందులో భాగంగా కోకాపేటలో ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుపై దృష్టి సారించింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే.. తాగునీటిని ఇతర అవసరాలకు మళ్లించే పరిస్థితిని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. నగరంలో పెరుగుతున్న నీటి అవసరాలకు అనుగుణంగా జలవనరుల నిర్వహణ కీలకంగా మారుతోంది. మరోవైపు ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి భావిస్తోంది. ఈ క్రమంలో శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టింది. భవన నిర్మాణాలు, పారిశ్రామిక అవసరాలు, రోడ్లపై దుమ్ము నియంత్రణ, రహదారుల శుభ్రత, పార్కులు, తోటల నిర్వహణ వంటి పనులకు గ్రీన్ వాటర్‌ను వినియోగించేలా ప్రోత్సహించనున్నారు. ప్రస్తుతం ఇలాంటి పనుల్లో తాగునీరు వినియోగించే సందర్భాలు తగ్గితే.. ప్రజల అవసరాలకు ఉపయోగపడే నీటిని మరింత సమర్థంగా అందుబాటులో ఉంచవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను సందర్శించి, పరీక్షలు నిర్వహించే విధానం, అనుసరిస్తున్న ప్రమాణాలు, ఫలితాల నమోదు ప్రక్రియ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని వివిధ అవసరాలకు సరఫరా చేయాలంటే దాని నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జలమండలి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రీన్ వాటర్ సరఫరాలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని జలమండలి ఎండీ సూచించారు. నీటి పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, హైదరాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే వాటిని పర్యవేక్షించేలా వ్యవస్థను రూపొందించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్ల కోసం ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి నాణ్యతకు సంబంధించిన వివరాలు ఎప్పుడైనా పరిశీలించేందుకు వీలుగా రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల నాణ్యత ప్రమాణాలను పర్యవేక్షించడంతోపాటు సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రతిపాదిత ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే విధానాన్ని కూడా పక్కాగా నిర్వహించనున్నారు. ట్యాంకర్ సామర్థ్యానికి అనుగుణంగా నీటి పరిమితిని నిర్ణయించి, ఒక్కో వాహనానికి ఎంత నీటిని సరఫరా చేశారనే వివరాలను నమోదు చేయాలని అశోక్‌రెడ్డి ఆదేశించారు. నిర్దిష్ట పరిమితికి మించి నీటిని నింపకుండా నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్యాంకర్లలో నింపిన తర్వాత మిగిలిపోయే నీటిని వృథా చేయకుండా సంబంధిత చెరువుకు మళ్లించేలా సాంకేతిక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రీన్ వాటర్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించడమే ఈ ప్రతిపాదన ప్రధాన లక్ష్యం. అయితే కోకాపేటలో ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి సాంకేతిక పరిశీలన కొనసాగుతోంది. కేంద్రం ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది, ఎంత పరిమాణంలో నీటిని సరఫరా చేస్తారు, ఏయే అవసరాలకు ఎంత నీటిని కేటాయిస్తారు అనే అంశాలపై మరిన్ని అధికారిక వివరాలు వెల్లడించాల్సి ఉంది. నీటి నాణ్యత, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా గ్రీన్ వాటర్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయగలిగితే.. తాగునీటిని పొదుపు చేయడంతోపాటు నగరంలో నీటి వనరుల వినియోగాన్ని మెరుగుపరిచేందుకు ఈ ప్రణాళిక ఉపయోగపడే అవకాశం ఉంది.

పుంగనూరులో 177 మంది
వైకాపా నేతలపై కేసులు

పుంగనూరు: అన్నమయ్య జిల్లా పుంగనూరులో ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల సందర్భంగా జరిగిన ఘర్షణలపై పోలీసులు చర్యలు చేపట్టారు. 177 మంది వైకాపా నాయ



కులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దాడులకు పాల్పడిన 15 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. కేసులు నమోదైన వారిలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప కూడా ఉన్నారు.

నాలుగు పట్టణాల్లో నామినేషన్లకు మరో అవకాశం

విజయవాడ, అక్టోబరు 23, అమరావతి వెలుగు : ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నాలుగు పట్టణాల్లో నామినేషన్ల దాఖలుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులను బెదిరించడం, దాడులు చేయడం, పత్రాలను చించివేయడం వంటి ఘటనలపై వచ్చిన ఫిర్యాదులు, అధికారుల నివేదికలు, ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు అక్టోబరు 21న ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అక్టోబరు 22న నోటిఫికేషన్ నం. 1135/SEC-F1/2026 జారీ చేసింది. అక్టోబరు 23, 24 తేదీల్లో నామినేషన్లు: కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55 వార్డులు; రాజంపేట మున్సిపాలిటీలో 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27 వార్డులు; మైదుకూరు మున్సిపాలిటీలో అన్ని వార్డులు; తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 1, 2, 3, 4, 5, 6, 9, 11, 12, 13, 14, 19, 55, 56, 57, 59, 65, 66 వార్డులకు ఈ అవకాశం వర్తిస్తుంది. ఈ రెండు రోజులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటికే నిర్దేశించిన కేంద్రాలతోపాటు సంబంధిత కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు సూచించిన కలెక్టరేట్ ప్రాంగణాల్లోనూ నామినేషన్లు సమర్పించవచ్చు. 25న పరిశీలన, ఉపసంహరణ: పొడిగించిన గడువులో కొత్తగా దాఖలైన నామినేషన్ల పరిశీలన అక్టోబరు 25న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు కొత్తగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు మాత్రమే తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. తుది పోటీ అభ్యర్థుల జాబితాను 25న మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రకటిస్తారు. సవరించిన ఎన్నికల షెడ్యూల్: రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు సవరించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబరు 1న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అవసరమైతే నవంబరు 2న రీపోలింగ్ చేపడతారు. నవంబరు 3న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈ షెడ్యూల్‌లో నామినేషన్ల గడువు పొడిగించిన నాలుగు పట్టణ సంస్థలతోపాటు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కూడా ఉంది. పరోక్ష ఎన్నికల షెడ్యూల్‌ను విడిగా ప్రకటించనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, నామినేషన్లు దాఖలు చేయడంలో అడ్డంకులు ఎదుర్కొన్న అభ్యర్థులకు అవకాశం కల్పించడంతోపాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా (రిటైర్డ్ ఐఏఎస్) ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు.

జడ్పీ చైర్మన్ రేసులో కదిరి కేంద్రంగా...

రసవత్తరం మారుతున్న రాజకీయం!

టీడీపీ నుంచి పరిటాల శ్రీరామ్.. వైఎస్సార్‌సీపీ నుంచి వజ్ర భాస్కర్‌రెడ్డి బరిలోకి.

రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల పోటీతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి.

కదిరిలో హాట్ హాట్ గా మారుతున్న రాజకీయ సమీకరణాలు.

ప్రభుత్వ పనితీరు.. స్థానిక సమస్యలు.. ఓటర్ల మనోగతంపై సర్వత్రా చర్చ

కదిరి, అక్టోబరు 23, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి సంబంధించి కదిరి నియోజకవర్గం కేంద్రంగా రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న తెలుగుదేశం పార్టీ నేత పరిటాల శ్రీరామ్, వైఎస్సార్‌సీపీ నేత వజ్ర భాస్కర్‌రెడ్డి ఇద్దరూ కదిరి నియోజకవర్గ పరిధిలోని నల్లచెరువు, గాండ్లపెంట జడ్పీటీసీ స్థానాల నుంచి పోటీకి దిగడం చర్చనీయాంశమైంది. దీంతో రెండు పార్టీల రాజకీయ వ్యూహాలు, స్థానిక నాయకుల ప్రభావం, ఓటర్ల మనోగతం ఎలా ఉండబోతున్నాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.





బరిలో ప్రధాన పార్టీల నేతలు... టీడీపీ తరఫున పరిటాల శ్రీరామ్ నల్లచెరువు జడ్పీటీసీ స్థానానికి, వైఎస్సార్‌సీపీ తరఫున వజ్ర భాస్కర్‌రెడ్డి గాండ్లపెంట జడ్పీటీసీ స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి సంబంధించి ఇద్దరి పేర్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తుండటంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే చైర్మన్ ఎంపికలో జడ్పీటీసీ స్థానాల ఫలితాలతోపాటు ఆయా పార్టీలకు వచ్చే సంఖ్యాబలం, పార్టీ అధిష్ఠానాల నిర్ణయాలు కీలకం కానున్నాయి.

ప్రభుత్వ పనితీరు ప్రభావం చూపనుందా?... రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ పనితీరు స్థానిక ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ప్రధాన చర్చగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలు, స్థానిక సమస్యల పరిష్కారంలో అధికార యంత్రాంగం స్పందన వంటి అంశాలు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అదే సమయంలో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, సాగునీటి సమస్యలు, ఉపాధి అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు కూడా ఎన్నికల సమయంలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం ఉన్న ఓటర్లు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చే అవకాశం ఉండగా, స్థానిక సమస్యలపై అసంతృప్తి ఉన్నవారు ప్రత్యామ్నాయాన్ని పరిశీలించే అవకాశముంది. అయితే కదిరి నియోజకవర్గంలో ఓటర్ల అభిప్రాయాలు ఏ వైపు ఉన్నాయనే దానిపై నిర్ధారిత సర్వే వివరాలు అందుబాటులో లేనందున, ప్రస్తుతానికి ఏ పార్టీకి మొగ్గు ఉందని చెప్పలేని పరిస్థితి.

వైఎస్సార్‌సీపీకి కలిసొచ్చే అంశాలపై చర్చ... ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉంది. స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, గతంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించడం, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడం ఆ పార్టీకి కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వ వ్యతిరేకత ఉందనే అంచనా ఒక్కటే విజయానికి హామీ ఇవ్వదు. అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, స్థానికంగా వారికి ఉన్న ఆదరణ, పార్టీ శ్రేణుల పనితీరు కూడా ప్రభావం చూపుతాయి.

అభ్యర్థుల బలం.. స్థానిక సమీకరణాలే కీలకం.... నల్లచెరువు, గాండ్లపెంట మండలాల్లో స్థానిక నాయకుల ప్రభావం, గ్రామస్థాయి రాజకీయ సమీకరణాలు, కుల సమీకరణాలు, అభ్యర్థుల ప్రజాసంబంధాలు, పార్టీ కార్యకర్తల సమన్వయం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలుగా నిలవనున్నాయి. రాష్ట్రస్థాయి రాజకీయాల కంటే స్థానిక అవసరాలు, అభ్యర్థుల అందుబాటు, గ్రామాల్లో వారు చేసిన పనులను ఓటర్లు ప్రాధాన్యంగా తీసుకునే అవకాశమూ ఉంది. టీడీపీకి అధికారంలో ఉండటం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఒక వైపు ఉంటే.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలు మరోవైపు కీలకంగా మారనున్నాయి. వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం ఉన్నప్పటికీ, దానిని ఓట్ల రూపంలోకి మార్చుకోవడం ఆ పార్టీ స్థానిక నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది.

ఓటరు తీర్పుపైనే ఉత్కంఠ... కదిరి నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు జడ్పీటీసీ బరిలో ఉండటంతో రాజకీయ వేడి పెరిగింది. ప్రభుత్వ అనుకూలతలు కూటమికి ఎంతవరకు తోడ్పడతాయి? స్థానిక సమస్యలు ప్రతిపక్షానికి అవకాశాలు కల్పిస్తాయా? అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం ఏ మేరకు పనిచేస్తుంది? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. అయితే ఎన్నికల ఫలితాలపై ముందస్తు అంచనాలకు వెళ్లడం కంటే, ప్రచార సరళి, ప్రజల నుంచి వచ్చే స్పందన, గ్రామస్థాయి సమీకరణాలు, పోలింగ్ ధోరణిని పరిశీలించడం ముఖ్యం. కదిరి నియోజకవర్గంలో ఓటరు ఎటువైపు మొగ్గు చూపుతారు? జడ్పీ చైర్మన్ పదవికి సంబంధించిన రాజకీయ సమీకరణాల్లో ఈ ఫలితాలు ఎలాంటి పాత్ర పోషిస్తాయి? అన్నది ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టత రానుంది.

శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన

జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

శ్రీ సత్యసాయి జిల్లా , అక్టోబరు 23, అమరావతి వెలుగు : జిల్లావ్యాప్తంగా గత మూడు రోజులుగా కొనసాగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్లకు చివరి రోజు కావడంతో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ శుక్రవారం సాయంత్రం బత్తలపల్లి ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ పరిశీలనలో ధర్మవరం డీఎస్పీ బి.వి. జగన్నాథ్ రాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



డీఎస్పీ మాణిక్యరావు పర్యవేక్షణలో ప్రశాంతంగా...

ముగిసిన జడ్పీటీసీ నామినేషన్లు

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా.. పటిష్ట పోలీసు బందోబస్తు

చివరి రోజు పోటాపోటీగా నామినేషన్లు.. జిల్లావ్యాప్తంగా మూడు రోజుల్లో 337 దాఖలు

కొత్తచెరువు, అక్టోబరు 23, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ పటిష్ట పోలీసు భద్రత మధ్య ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పుట్టపర్తి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సి. మాణిక్య రావు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. చివరి రోజు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోటా పోటీగా నామినేషన్లు దాఖలు చేసిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.



డీఎస్పీ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు... కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ సి. మాణిక్యరావు పర్యవేక్షించారు. పుట్టపర్తి అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యువరాజ్, కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. నామినేషన్ల కేంద్రం పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తూ, అభ్యర్థులు, నాయకులు, వారి అనుచరుల రాకపోకలను పర్యవేక్షించారు. చివరి రోజు రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రశాంత వాతావరణంలో ముగిసింది.

చివరి రోజు 182 నామినేషన్లు... జిల్లాలోని 32 జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి చివరి రోజు మొత్తం 182 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి 64, వైఎస్సార్‌సీపీ నుంచి 63, జనసేన నుంచి 21, బీజేపీ నుంచి ఐదు, స్వతంత్ర అభ్యర్థులుగా 29 మంది నామినేషన్లు సమర్పించారు. మూడు రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా మొత్తం 337 నామినేషన్లు దాఖలయ్యాయి.

ప్రశాంతంగా ముగిసిన ప్రక్రియ.. జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ సి. మాణిక్యరావు పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిఘా, ముందస్తు భద్రతా చర్యలతో నామినేషన్ల కేంద్రం వద్ద ప్రశాంత వాతావరణం కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దవడుగూరు జెడ్పీటీసీ అభ్యర్థిగా...

ఎద్దుల అనురాధ నామినేషన్ దాఖలు

అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో వైకాపా తరఫున నామినేషన్ సమర్పణ

నామినేషన్ల వేళ దాడుల ఘటనల నేపథ్యంలో అనురాధ నామినేషన్‌పై రాజకీయ వర్గాల్లో చర్చ

అనంతపురం, అక్టోబరు 23, అమరావతి వెలుగు : జిల్లాలోని పెద్దవడుగూరు మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా పెద్దవడుగూరు పట్టణానికి చెందిన ఎద్దుల అనురాధ నామినేషన్ దాఖలు చేశారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమె తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, పలు ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న దాడులు, ఘర్షణల వార్తల మధ్య ఎద్దుల అనురాధ నామినేషన్ దాఖలు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వైకాపా తరఫున ఆమె నామినేషన్ సమర్పించడంతో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెద్దవడుగూరు మండల జెడ్పీటీసీ స్థానానికి అనురాధ అభ్యర్థిత్వం ఖరారు కావడం, ఆమె నామినేషన్ దాఖలు చేయడంతో మండల రాజకీయాల్లో ఎన్నికల సందడి నెలకొంది.



నామినేషన్లకు ఆటంకం కలిగిస్తే...

కఠిన చర్యలు

అనంతపురం, అక్టోబరు23, అమరావతి వెలుగు : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులను ఎవరైనా అడ్డుకున్నా, భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నామినేషన్లు వేసేందుకు వెళ్లే అభ్యర్థులకు ఎవరైనా ఆటంకాలు కలిగించినా, అడ్డుకున్నా వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారులు, పోలీసు లేదా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి, అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులందరి నామినేషన్లను స్వీకరించాలని రిటర్నింగ్ అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవాలని ఆయన సూచించారు.



తాగునీటి కష్టాలకు చెక్..

గుత్తి బాలికల పాఠశాలకు ఆర్వో ప్లాంట్...!

రూ.1.71 లక్షలతో సురక్షిత తాగునీటి సదుపాయం.. వెయ్యి మంది విద్యార్థినులకు ఊరట

మూడు నెలలుగా వేధిస్తున్న నీటి సమస్యకు పరిష్కారం చూపిన సాహితీ గగన్ మహల్ ట్రస్ట్

గుంతకల్లు, అక్టోబరు 23, అమరావతి వెలుగు : మూడు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గుత్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఎట్టకేలకు ఊరట లభించింది. సుమారు వెయ్యి మంది బాలికలకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1,71,000 విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వరలక్ష్మి సమృద్ధి ఫౌండేషన్ అధినేత్రి ఎల్. వరలక్ష్మి అందించిన విరాళంతో ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు జె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గత మూడు నెలలుగా పాఠశాలలో తాగునీటి సమస్యతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వెంటనే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థినుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యతోనే భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకన్న, ఉపాధ్యాయులు మంజుల, రాజేశ్వరి, మాధవరావు, చంద్రిక, రాధిక, పాఠశాల కమిటీ చైర్మన్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ శివ, కమిటీ సభ్యులు మాణిక్యం, విమల తదితరులు పాల్గొన్నారు.విద్యార్థినుల తాగునీటి సమస్య పరిష్కారానికి ముందుకొచ్చిన దాత ఎల్. వరలక్ష్మికి, ట్రస్ట్ అధ్యక్షుడు జె. ప్రతాప్ రెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.



స్థానిక ఎన్నికలపై పరిటాల శ్రీరామ్ వరుస భేటీలు







శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబరు 23, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ జిల్లాలో రాజకీయ పర్యటనలను ముమ్మరం చేశారు. నల్లచెరువు జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. రాజుతో కలిసి పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ముఖ్య నేతలు, కూటమి నాయకులతో సమావేశమై స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై చర్చించారు. అనంతరం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో పాటు పల్లె సింధూర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన నామినేషన్ వివరాలను తెలియజేస్తూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. అనంతరం రామగిరి మండలం వెంకటాపురంలోని స్వగ్రామానికి చేరుకున్న పరిటాల శ్రీరామ్ ఇలవేల్పు ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత పరిటాల ఘాట్ వద్ద తండ్రి పరిటాల రవీంద్ర స్మారక చిహ్నానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వరుస భేటీలు, పర్యటనల ద్వారా స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయానికి శ్రీరామ్ ప్రాధాన్యం ఇచ్చారు.

చంటి బిడ్డలతో వచ్చి జడ్పీటీసీకి నామినేషన్లు

కొత్తచెరువు, అక్టోబరు 23, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని కొత్తచెరువు ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ నామినేషన్ల చివరి రోజు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా చంటి బిడ్డలను ఎత్తుకొని నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన మహిళా అభ్యర్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కదిరి నియోజకవర్గంలోని తలుపుల మండల జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఇద్దరు మహిళా అభ్యర్థులు తమ చిన్నారులను ఎత్తుకొని నామినేషన్లు వేసేందుకు వచ్చారు. అలాగే గోరంట్లకు చెందిన జనసేన పార్టీ అభ్యర్థి సునేత్ర సైతం అప్పుడే పుట్టిన బిడ్డను వెంట తీసుకొని నామినేషన్ దాఖలు చేసేందుకు చేరుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు చిన్నారులతో సహా నామినేషన్ కేంద్రాలకు వచ్చిన మహిళలను చూసి అక్కడున్న పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.





నల్లచెరువు జడ్పీటీసీ అభ్యర్థిగా...
పరిటాల శ్రీరామ్ నామినేషన్

కొత్తచెరువు, అక్టోబరు 23, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు జడ్పీటీసీ అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఎలాంటి హడావుడి లేకుండా ఆయన అనూహ్యంగా నామినేషన్ దాఖలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు పాల్గొన్నారు.



కామ్రేడ్ పెద్దన్న కుటుంబానికి...
సీపీఎం నాయకుల ఆర్థిక సాయం

కొత్తచెరువు, అక్టోబరు 23, అమరావతి వెలుగు : మండల కేంద్రానికి చెందిన సీపీఎం శాఖ సభ్యుడు కామ్రేడ్ పెద్దన్న (70) అర్ధరాత్రి ఛాతినొప్పితో మృతి చెందడం పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) శ్రీ సత్యసాయి జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మరణం పార్టీకి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. పెద్దన్న కుటుంబానికి అండగా నిలిచేందుకు సీపీఎం నాయకులు అంకె ముత్యాలు, పైపల్లి గంగాధర్ కలిసి రూ.2,000 ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీకి పెద్దన్న చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు.



పోలింగ్ సిబ్బందికి రెండో విడత...
ర్యాండమైజేషన్ పూర్తి

అనంతపురం, అక్టోబరు 23, అమరావతి వెలుగు : జిల్లాలో 2026 మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాలులో స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు సుబ్బరాజు సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 689 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆయా కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు కలిపి మొత్తం 4,960 మంది సిబ్బందిని కేటాయించి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 20 శాతం అదనపు సిబ్బందిని కూడా కేటాయించినట్లు వివరించారు. కేటాయించిన సిబ్బందికి ఈ నెల 24న నీలం రాజశేఖర్‌రెడ్డి కన్వెన్షన్ హాలులో తరగతి గది తరహాలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, డీఐఓ భారతి, ఎన్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.



అనంతపురం అభివృద్ధికి...
వైఎస్సార్‌సీపీని గెలిపించాలి

అనంతపురం, అక్టోబరు 23, అమరావతి వెలుగు : నగరాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ మేయర్ అభ్యర్థి సి. రమేష్ కోరారు. అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా రహీమ్ ఖాద్రి మసీదు (ఖబ్రస్తాన్), నూరానీ మసీదు సమీపంలో మైనార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనతోపాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ హయాంలో ముస్లిం మైనార్టీలకు జరిగిన ప్రయోజనాలను వివరించారు. అనంతపురం నగర అభివృద్ధికి తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గౌస్ బేగ్, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి నదీమ్‌తోపాటు పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



ధర్మవరంలో బీజేపీ అభ్యర్థుల తరఫున
త్రివేణి ఎన్నికల ప్రచారం

ధర్మవరం, అక్టోబరు 23, అమరావతి వెలుగు : ధర్మవరం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరఫున రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సతీమణి త్రివేణి శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థులు జింకా భారతి (46వ వార్డు), కృష్ణాపురం రజియా బేగం (16వ వార్డు), గుండా పద్మావతి (19వ వార్డు)లతో కలిసి ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ అభ్యర్థులకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. వార్డుల అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్డీఏ కూటమి తరఫున పోటీ చేస్తున్న పరిశే సుధాకర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని త్రివేణి కోరారు.










నామినేషన్లకు పూర్తి భద్రత

శ్రీ సత్యసాయి జిల్లా, అక్టోబరు 23, అమరావతి వెలుగు : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి భయం, ఒత్తిడి, అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసేందుకు పూర్తి భద్రత కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందన్నారు. అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ఎవరైనా బెదిరించినా, అడ్డుకున్నా, ఒత్తిడికి గురిచేసినా బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలాంటి ఘటనలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన పోలీసు భద్రత కల్పిస్తామని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పాల్గొనే ప్రతి అభ్యర్థికి రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



ఈవీఎం గోదాము వద్ద...
నిరంతర నిఘా ఉండాలి

ధర్మవరం, అక్టోబరు 23, అమరావతి వెలుగు : జిల్లాకు కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశిం చారు. ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదామును శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా గోదాము వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, రక్షణ చర్యలను పరిశీలించారు. ఈవీఎం గోదాము వద్ద 24 గంటలూ పటిష్టమైన భద్రత, నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులకు సూచించారు. గోదాము భద్రత, నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలిచ్చి సందేహాలను నివృత్తి చేశారు. తనిఖీల్లో ధర్మవరం ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, తహసీల్దార్ దేవరాజు, రెవెన్యూ సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



27న ఎన్నికల సిబ్బందికి...
పోస్టల్ బ్యాలెట్లు పంపిణీ

పుట్టపర్తి, అక్టోబరు 23, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈ నెల 27న పోస్టల్ బ్యాలెట్లు అందుబాటులో ఉంటాయని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గతంలో ప్రకటించిన ఈ నెల 24వ తేదీకి బదులుగా 27న పోస్టల్ బ్యాలెట్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు సంబంధిత మున్సిపాలిటీల ద్వారా పోస్టల్ బ్యాలెట్లు పొంది తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

చెన్నేకొత్తపల్లి ఎంపీటీసీ 2 ఏకగ్రీవగా...
ఎన్నికైన నాగరాజు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 23, అమరావతి వెలుగు : చెన్నేకొత్తపల్లి ఎంపీటీసీ టు గా గేట్ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఎంపీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగరాజు మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన గ్రామ పెద్దలకు, నాయకులకు, యువతకు, ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని గేట్ నాగరాజు వెల్లడించారు.



గుండెపోటుతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

అనంతపురం, అక్టోబరు 23, అమరావతి వెలుగు : ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సి. శ్రీరాములు (56) అకాల మరణం చెందారు. రాప్తాడు మండలం పాలభావి గ్రామానికి చెందిన ఆయన 1995 బ్యాచ్‌లో పోలీసు శాఖలో చేరి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా (1242) విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కన్నుమూశారు. ఆయనకు భార్య యశోద, ఇద్దరు కుమార్తెలు ఇంద్రజ, అనుష ఉన్నారు. శ్రీరాములు మృతి పట్ల జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. పోలీసు శాఖ తరఫున తక్షణ సాయంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని అధికారులు భరోసా ఇచ్చారు. శ్రీరాములు అంత్యక్రియలను ఆయన స్వగ్రామమైన పాల భావిలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సూర్యకుమార్, శివ కుమార్, లక్ష్మీనారాయణ, బంధువులు, గ్రామస్థులు పాల్గొని కన్నీటి పర్యంతమై చివరి వీడ్కోలు పలికారు.



శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన
జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ

కొత్తచెరువు, అక్టోబరు 23, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రశాంతంగా ముగిసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారులు నామినేషన్ల వివరాలను క్రోడీకరిస్తున్నారని, దాఖలైన నామినేషన్లకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి కొత్తచెరువులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన ప్రారంభమవుతుందని వెల్లడించారు. అభ్యర్థులు ఉదయం 8 గంటలకు జెడ్పీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ పత్రాలను పరిశీలించి, అర్హతలను బట్టి ఆమోదించడం లేదా తిరస్కరించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.



Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576